అలరించిన దాండియా ..

కంటోన్మెంట్‌లో నవరాత్రి ఉత్సవ్ పోస్టర్‌లు, పాసులను ఆవిష్కరిస్తున్న బుల్లితెర నటి నేహాస్వరూప్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 22: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కంటోన్మెంట్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో మానెపల్లి జువెల్లర్స్ సౌజన్యంతో బ్రిందా నవకార్ నవరాత్రి ఉత్సవ్–24 పేరిట దాండియా గర్భ నృత్యానికి సంబంధించి ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుల్లితెర నటి నేహాస్వరూప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న నవరాత్రి ఉత్సవ్ పోస్టర్‌లు, పాసులను నిర్వాహకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. నవరాత్రులంటే దాండియా, గర్భ నృత్యాల సందడి ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలను తానెంతో ఎంజాయ్ చేస్తానన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కవి తాజైన్, సలోని జైన్, ఐశ్వర్య షా, చింతన్ మోహిత, జిగ్నేష్, మానేపల్లి జువెల్లర్స్ ప్రతినిధి గోపి, బ్రిందా డైమండ్స్ ప్రతినిధి కృష్ణబంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

ఆహార పొట్లాలను అందజేస్తున్న స్కై ఫౌండేషన్ సభ్యులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 22 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 261వ అన్నదానం నిర్వహించారు. నగరంలోని రోడ్ల పక్కన, పుట్‌పాత్‌లపై ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులు, దివ్యాంగులకు భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ పావని తెలిపారు. ఎండా, వానలకు అల్లాడుతున్న అనాథలు, నిరాశ్రయులను చేరదీసి వారికి ఆశ్రయం, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. నిరాశ్రయుల కోసం మొబైల్ వైద్యశాలలను ఏర్పాటు చేసి వైద్యసేవలను అందించాలని వారు కోరారు. స్కై ఫౌండేషన్ సభ్యులు కోమల్, అఖిల్, శుభం, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరుసగా వర్షాలు..బస్తీలు జలమయం

బేగంపేట్‌లోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీటిని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

- అర్ధరాత్రి లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

బేగంపేట్ సెప్టెంబర్ 22: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బేగంపేట్, రాంగోపాల్‌పేట్ డివిజన్‌లలోని లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. కాలనీలు, బస్తీలన్ని నీట మునిగాయి. నాలాలు పూర్తిగా ఉప్పొంగి బస్తీలు, ఇండ్లలోకి మురికి నీరు వచ్చి చేరింది. బస్తీల ప్రజలంతా అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో బేగంపేట్‌లోని బ్రాహ్మణవాడి, మయూరిమార్గ్, అల్లంతోట బావి, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీలు, బేగంపేట్ పాత ఎయిర్‌పోర్ట్ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ పంపు ముంపు ప్రాంతం, అలాగే ఒల్డ్ కస్టమ్స్ బస్తీలో పూర్తిగా వర్షం నీరు నిలిచిపోయింది. రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కళాసీగూడ, చుట్టలబస్తీ ప్రాంతాలు పూర్తిగ నీట మునిగాయి. ఇండ్లలోని వర్షం నీరు వచ్చి చేరింది. ఇక్కడ ప్రధానంగ కళాసీగూడ నాలా ఉప్పొంగి బస్తీలను నీట ముంచింది. నాలాల్లో నీరు కూడా బయటకు వచ్చి కాలనీల్లోకి చేరింది. దీంతో బస్తీ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి మూడు గంటల వరకు వర్షం నీరు తగ్గుముఖం పట్టింది. ఇక గండం గట్టెక్కాం అనుకునే లోపు మరోసారి శనివారం ఉదయం. తిరిగి రాత్రి వర్షం దంచి కొట్టింది. మళ్లీ పరిస్థితి యధావిధిగా మారింది. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి కాలనీల్లోకి వచ్చిన మురికి నీరు కాస్త తగ్గ ముఖం పట్టింది. ఈ లోపల రాత్రి మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో బస్తీలు, కాలనీల్లో పెద్ద మొత్తంగా నీరు, బురద చేరడంతో బస్తీ వాసులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

బేగంపేట్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..

వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బేగంపేట్‌లో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో అర్ధరాత్రి హైడ్రా కమిషనర్ రంగనాథ్, బేగంపేట్‌లో అకస్మికంగా పర్యటించి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బేగంపేట్‌లో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచి పోయింది. వరద నీరు నిలవడం దానికి కారణాలపై ఆరా తీశారు. ఇక్కడ వర్షం కురిసిన ప్రతిసారి పరిస్థితి ఇలాగే ఉంటుందని అక్కడి స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కళాసీగూడ బస్తీలోకి వచ్చిన వరద నీరు

గజ్జెల శ్రీనును పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని

బీఆర్ఎస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు గజ్జెల శ్రీనును మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల గజ్జెల శ్రీను సోదరుడు సుంకరి రాజారామ్ మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజారామ్ కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, శివకుమార్, సురేశ్, వినోద్, నర్సింగ్‌రావు లు వెంట ఉన్నారు.

– బన్సీలాల్‌పేట్

కేదారి మరణం తీరని లోటు

కార్మిక నేతగా, పద్మశాలి సంఘం అధ్యక్షునిగా, బీఆర్ఎస్ నేతగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక సమస్యల పరిష్కారానికి గంజి కేదారి తన వంతు సేవలందించారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌కు చెందిన గంజి కేదారి మరణం తీరని లోటని పేర్కొంటూ సనత్‌నగర్ బీకేగూడలోని నివాసంలో ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజేశ్ ముదిరాజ్ తదితరులున్నారు.

– అమీర్‌పేట్, సెప్టెంబర్ 22

అమీర్‌పేట్ ఇండ్లలోకి ముంగీసలు

అమీర్‌పేటలోని ఓ ఇంట్లోకి వచ్చిన ముంగీస

వెంగళరావునగర్, సెప్టెంబర్ 22: ఎంతటి విషసర్పమైనా ముంగీసని చూస్తే బెదిరిపోతుంది. పాములతోనే పోరాడే ముంగీసలు ఇండ్లలోకి వచ్చి తిరుగుతుంటే గుండెలు గుభేలుమంటున్నాయి. అమీర్‌పేట్ గురుద్వారా ఎదురుగా ఉన్న హాస్టల్స్, ఇండ్లల్లో రెండు ముంగీసలు తిరుగుతున్నాయి. ఎక్కడి నుంచి వచ్చయోకాని ఇంట్లో నుంచి తరిమి కొట్టినా మళ్లీ వస్తున్నాయి. ముంగీసల బెడదతో అక్కడ హాస్టల్స్‌లో ఉంటున్న యువకులు, యువతులు ఆందోళన చెందుతున్నారు. అమీర్‌పేట్ కు చెందిన సమాజ సేవకుడు టిల్లుభాయ్ ఇంట్లోకి 15 రోజుల క్రితం 2 ముంగిసలు వచ్చాయి. ప్రతిరోజూ చుట్టుపక్కల ఉన్న హాస్టల్‌లలో ఈ రెండు ముంగిసలు చక్కర్లు కొడ్తున్నాయి. అతని ఇంట్లో ఉన్న డ్రెస్సింగ్ టేబుల్ అద్దాన్ని ముంగిస పగులగొట్టింది. ఇండ్లల్లోని సామాన్లను చిందరవందర చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతి దవాఖాన ఆవరణలో మొన్ననటి వరకు అడవిని తలపించేలా ఉన్న చెట్లను తొలగించి నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవనాలతో ఆవాసాలు కోల్పోయి..అమీర్‌పేట్ వైపు వచ్చి ఉండొచ్చని పలువురు అన్నారు. నిరంతరం కురుస్తున్న వర్షాలకు నేచర్‌క్యూర్ దవాఖాన, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వైపు నుంచి వచ్చి ఉండొచ్చని ఇంకొందరు బావిస్తున్నారు. ముంగీసలు ఇండ్లలోకి వచ్చి గిన్నెలు, సమాగ్రిని చిందరవందర చేస్తున్నాయని అన్నారు. తమ పై దాడి చేస్తాయోమోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ముంగీసల్ని పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బతుకమ్మ సంబురాలకు ఆహ్వానం

బతుకమ్మ సంబురాలకు రావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్నను ఆహ్వానిస్తున్న సంఘం నేతలు

సికింద్రాబాద్,సెప్టెంబర్ 22: బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్నను తమిళనాడు చెన్నైలో నిర్వహించే బతుకమ్మ సంబురాలకు తెలంగాణ సంఘం ఆహ్వానించింది. చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో 11సంవత్సరాలుగా బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చెన్నై ఆదియప్ప వీధి రోడ్డు నంబర్ 1లో కన్యాకాపరమేశ్వరి మహిళా కళాశాల మైదానంలో జరిగే సంబురాల్లో పాల్గొనాలని కోరారు. తెలంగాణ సంఘం నాయకులు అధ్యక్షులు అంజయ్య, పరశురాములు, శ్రీనివాస్, షఫీ, నరసింహ, అశోక్, అంజయ్య, గిరి, రామ్మూర్తి , తమిళనాడు కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్‌లతో పాటు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా నిలుస్తాం

అమీర్‌పేట్, సెప్టెంబర్ 22 : సనత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌కు చెందిన అఫ్సాన్ మృతి చెందారు. కడుపు నొప్పితో వచ్చిన తమ కుమారుడికి డ్యూటీ డాక్టర్ అందించిన వైద్యం వికటించి మృతి చెందాడంటూ మృతుని కుటుంబ సభ్యులు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుసలు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దివారం సనత్‌నగర్ ఎస్ఆర్‌టీలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తమ కుమారుడి కడుపు నొప్పికి చికిత్సలు అందిండచంలో డ్యూటీ డాక్టర్ వైఫల్యం చెందాడని మృతుడి తండ్రి హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని సనత్‌నగర్ ఫోన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో మాట్లాడుతూ అఫ్సాన్ మృతిపై సమ్రగ విచారణ జరపాలని ఆదేశించారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామని తలసాని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సనత్‌నగర్ జామా మసీదు అధ్యక్షులు సయ్యద్ నొమానుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఖలీల్, జమీర్ ఉన్నారు.

సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలి

మధురానగర్ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

సికింద్రాబాద,సెప్టెంబర్ 22: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో మేకల కీర్తిహర్ష కిరణ్ ఆధ్వర్యంలో, భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ అరుణ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారంగపాణి, మాజీ కార్పొరేటర్ సుజాత, అంబాల రాజేశ్వరరావు, హరి, హనుమంతు, అనిత, లావణ్య, నాగరాణి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ : బౌద్ధనగర్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. డివిజన్‌లోని పలు బస్తీలలో ప్రజలు, వ్యాపారవేత్తలతో ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్‌గౌడ్ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ రాజకీయ పార్టీలలో సభ్యత్వంలో బీజేపీ మొదటిస్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తు, నేతి సత్యనారాయణ, అజయ్, సురేశ్, వేణుగోపాల్, లక్ష్మణ్, సురేశ్, గజరాజుపాల్, పవన్ నాయడు తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి : వికసిత భారత్ కోసం బీజేపీలో సభ్యత్వం తీసుకొని బీజేపీని బలోపేతం చేయాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ అన్నారు. బీజేపీ సదస్యత అభియాన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కంటోన్మెంట్ ఐదవ వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. బీజేపీ సభ్యత్వం కోసం ఫోన్ నం. 8800002024 కి మిస్డ్ కాల్ ఇచ్చి తమ వివరాలు నమోదు చేయాలని, రెఫరల్ కోడ్ వద్ద ఆర్78వీకే ఎంటర్ చేసి తమ ఫొటోతో కూడిన బీజేపీ సభ్య త్వ కార్డును పొందాలని సూ చించారు. ఈ సందర్భంగా బ స్తీ, కాలనీల్లో పర్యటిస్తూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని ఆయ న సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు 1 బీజేపీ అధ్యక్షుడు బొట్టు శంకర్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవి ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఆదివారం వారాసిగూడ ప్రాంతాలలో వ్యాపార సంస్థల యజమానులతో ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్‌నాయుడు, నాగభూషన, బొంది శ్రీనివాస్, చిలుక సురేశ్ పాల్గొన్నారు.

అమీర్‌పేట్ : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సనత్‌నగర్ డివిజన్‌లో చురుగ్గా జరుగుతోంది. డివిజన్‌లోని బూత్ నంబర్ 172లో జరుగుతున్న సభ్యత్వ నమోదులో పార్టీ సీనియర్ నాయకులు ఆకుల బాలనర్సింహ, లింగంపల్లి నర్సింగ్‌రావులతో పాటు బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఆకుల మహేశ్, నాయకులు రమేశ్ గౌడ్, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. బీజేపీ పట్ల ప్రజల్లో చక్కటి స్పందన ఉందని, పార్టీని ఆదరిస్తున్న వారందరికీ సభ్యత్వం కల్పించే విషయంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించి, సభ్యత్వాల నమోదు గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని లింగంపల్లి నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు.

విశ్వేశ్వరయ్య ఆదర్శంగా.. సేవలు

వసంతనగర్ ఏఈ సత్యవాణి అల్లూరిని సన్మానిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ కృష్ణ మోహన్‌రావు

అబిడ్స్, సెప్టెంబర్ 22: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఇంజినీర్స్ డేను మెగాసిటీ నవ కళావేదిక ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎస్‌పీడీసీఎల్ సైబర్‌సిటీ సర్కిల్ వసంతనగర్ అసిస్టెంట్ ఇంజినీర్ సత్యవాణి అల్లూరిని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా వకుళాభరణం మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజినీర్ సత్యవాణి అల్లూరి మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ఇరవై సంవత్సరాలు పలు ప్రాంతాలలో ప్రజలకు సేవలందించారని కొనియాడారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా సార్ విశ్వేశ్వరయ్య స్మరణతో సన్మానించడం అభినందనీయమన్నారు.

దళిత జర్నలిస్ట్ చైతన్య సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

దళిత జర్నలిస్ట్ చైతన్య సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 22: దళిత జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న రవీంద్రభారతిలో జరిగే చైతన్య సభను ప్రతి దళిత జర్నలిస్టు హాజరై విజయవంతం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శివకుమార్ కోరారు. బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మరావు గౌడ్ చేతుల మీదుగా దళిత జర్నలిస్ట్ ఫోరం చైతన్య సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రధాన్యం కల్పించాలని, అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించాలని, దళిత సీనియర్ జర్నలిస్టులకు నామినేట్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ అంశాలపై సభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎల్లేష్, గ్రేటర్ కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు రాములు, మహేందర్, రాయుడు, సాగర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నవ్యనాటక సమితి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతున్న 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలలో భాగంగా 4వ రోజు ఆదివారం ప్రత్యేక సంచికను వక్తలు జి. వసుంధర, డాక్టర్ కళాకృష్ణ, కె. సాగరరావు, వాసా గోపినాద ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ సంగీత, నృత్య గురువులు పాల్గొని యువ ఔత్సాహిక కళాకారులకు పలు అంశాలపై ప్రసంగాలతో వివరించారు.

– తెలుగు యూనివర్సిటీ

రక్తదానం ప్రాణ దానంతో సమానం

గుడిమల్కాపూర్ డివిజన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని ప్రసంగిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కార్వాన్, సెప్టెంబర్ 22 : రక్తదానం ఒకరి ప్రాణాలు కాపాడుతుందని ఇలాంటి రక్తదానంలో పాలొనడం గొప్ప విషయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ 74వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ చేపట్టిన సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లోని తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియం ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి వైపు దూసుకుపోతున్నదని అన్నారు. బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేసిన 30 మందికి దేవర శ్రీనివాస్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా తెలంగాణ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గూనేటి కిరణ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, జాతీయ కౌన్సిల్ మెంబర్ పాపయ్య గౌడ్‌లతో పాటు కార్వాన్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చలో సంక్షేమ భవన్‌ను విజయవంతం చేయండి

గోల్నాకలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

గోల్నాక, సెప్టెంబర్ 22 : సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు సోమవారం చేపడతున్న చలో సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బిట్ర సుబ్బారావు పిలుపునిచ్చారు. ఆదివారం గోల్నాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.రాములు, ఇందిర, రేణు క, సుజాత పాల్గొన్నారు.

తెలంగాణ ఆక్యుపంక్చర్ మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

రవీంద్రభారతి,సెప్టెంబర్ 22 : రాష్ట్ర ప్రభుత్వం ఆక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తించి , తెలంగాణ ఆక్యుపంక్చర్ మెడికల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.ఎన్. సుధీర్, ప్రధాన కార్యదర్శి డా.పీఎస్ సాగర్, కోశాధికారి గొల్ల సుభాష్ డిమాండ్ చేశారు. ఆదివా రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2018లో ఆక్యుపంక్చర్‌ను ఆమోదించిందని, తెలంగాణలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఈ వైద్యానికి సహకారం అందించాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాకేశ్, జైశ్వాల్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ త్రివిక్రమ్, ఎస్. రవీందర్ పాల్గొన్నారు.

30న వక్తృత్వ పోటీలు

అమీర్‌పేట్, సెప్టెంబర్ 22 : అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో ఈ నెల 30న వక్తృత్వ పోటీలు జరుగనున్నాయి. 'ఇండియా కూలింగ్ యాక్షన్ ప్లాన్' అనే అంశంపై జరిగే ఈ పోటీలకు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన నలుగురు చొప్పున ఓ బృందంగా ఏర్పడి ఈ పోటీల్లో పాల్గొనవచ్చిని అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు సర్టిఫికెట్లతో విజేతలకు మెరిట్ సరిఫికెట్లుతో పాటు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 30వ తేదీ సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కేంద్ర కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు జరుగుతాయని, ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్ల నమోదుకు సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు (9177303127), ఎ.సోమేశ్‌కుమార్ మీడియా కోఆర్డినేటర్ (9908179676)లను సంప్రదించాలని కోరారు.

పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పాడి రైతుల సమస్యలపై మాట్లాడుతున్న కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్ కుమార్

కార్వాన్, సెప్టెంబర్ 22 : పశు పోషణపై ఆధారపడి పాల ఉత్పత్తితో తమ జీవితాలు వెల్లదీస్తున్న పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. పాడి పశువులపై ఆధారపడిన పాల ఉత్పత్తిదారులు, పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల విషయమై ఆయన కార్వాన్ యాదవ సంఘం శ్రీ క్రిష్ణ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ, సహకారాలు అందడం లేదని అందుకు విరుద్ధంగా ఇంట్లో 4,5 బర్లను పోషిస్తూ పాల ఉత్పత్తితో జీవిస్తున్న కుటుంబాల పై నల్లా బిల్లు, ఆస్తి పన్ను, కమర్షియల్ పేరుతో అదనపు వసూళ్లు చేయడం దారుణమన్నారు. పశువులకు వైద్య పరంగా కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించడం వల్ల వేలాది రూపాయలు పశువుల వైద్యం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పాడి రైతుల నుంచి పాలు సేకరిస్తున్న ప్రభుత్వ, పైవేట్ డైరీలు మోసపూరితంగా వ్యవహరిస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు అశోక్ యాదవ్ ఆరోపించారు. ఆవు పాలకు కనీసం రూ.50,